క్లుప్తంగా

నేడు కార్తీక వన భోజనం

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం తరఫున బుధవారం కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిత్య కల్యాణోత్సవం, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. సంప్రదాయం ప్రకారం శ్రీవారి మెట్టు వద్ద పార్వేట మండపంలో వనభోజనం నిర్వహించాల్సి ఉన్నప్పటికీ వర్షం కారణంగా కల్యాణ వెంకన్న ఆలయంలోనే జరిపించనున్నట్లు వివరించారు.

సీఎం పర్యటనకు శానిటేషన్ డ్రైవ్

తిరుపతి రూరల్ : జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం సీఎం చంద్రబాబు రానున్న నేపథ్యంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపడుతున్నారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గంలోని తిరుచానూరు, పద్మావతిపురం, శ్రీనివాసపురం, ఓటేరు, వేదాంతపురం, అవిలాల, గాంధీపురం, మల్లంగుంట, తుమ్మలగుంట, పేరూరు, సి.మల్లవరం పంచాయతీల్లో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగిస్తున్నారు. శానిటేషన్ డ్రైవ్ పనులను మంగళవారం తిరుపతి రూరల్ ఎంపీడీఓ రామచంద్ర, తుమ్మలగుంట పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

చెరుకు పంట పరిశీలన

తిరుపతి రూరల్ : మండలంలోని శానకుప్పం, శీలవాయి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న చెరుకు పంటను వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ సరళ, డాక్టర్ నాగమణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెరుకును ఆశించిన ఎర్రగాళ్ల కసు(బోదెగడ్డి), కాండం తొలుచు పురుగు, పొలుసు పురుగు, పిండినల్లి, పొక్క బొగా పురుగులు, తెగుళ్లను గుర్తించారు. బోదెగడ్డి, ఇతర వెడల్పాటి గడ్డిజాతి మొక్కలను నివారించేందుకు పారాక్వాటి, సోడియం సాల్ట్‌లను పిచికారీ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్‌జే షుగర్ ఫ్యాక్టరీ సలహాదారు వరదరాజన్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో శ్రమిస్తేనే ఉన్నతి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : విద్యార్థులు క్రమశిక్షణతో శ్రమిస్తేనే ఉన్నత స్థాయికి చేరుకోగలరని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతినాయుడు తెలిపారు. మంగళవారం ఎస్‌బీఎస్ ఆర్ట్స్' కళాశాలలో నూతన విద్యార్థి సంఘం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ గూగుల్, సోషల్ మీడియా కంటే గురువే మిన్న అన్నారు. కళాశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు గర్వించే స్థాయికి విద్యార్థులు చేరుకోవాలని ఆకాంక్షించారు. టీటీడీ డీఈఓ నాగరాజనాయుడు, ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ, డి.పరమేశ్వర్ పాల్గొన్నారు.

దళారులపై చర్యలకు డిమాండ్



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందిస్తున్న శివ కాపు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నగదు వసూలుకు పాల్పడుతున్న దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత కాపు బీసీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సుంగుకూరు శివ కాపు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ దళారులు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగుల నుంచి రూ.10లక్షలు వసూలు చేస్తున్నట్లు వివరించారు. ఐదేళ్లుగా పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లనే కొనసాగించాలని కోరారు.

పునర్నిర్మాణ పనుల పరిశీలన

తిరుపతి కల్చరల్ : శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో పెండింగ్‌లో ఉన్న పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిశీలించారు. మంగళవారం గంగమ్మ ఆలయం వద్ద అధికారులతో మాట్లాడారు. ప్రహరీ గోడ, ఫ్లోరింగ్, క్యూలైన్లు, స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు పనులను జనవరి లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. టీటీడీ ఈఈ ప్రసాద్, ఏడబ్ల్యూ ఏఈ వంశీ, డీఈ గోవిందరాజులు, దేవదాయ శాఖ ఏఈ ఆనంద్, ఈఓ ఏ.జయకుమార్ పాల్గొన్నారు.

శెట్టిపల్లె భూములపై విచారణ

తిరుపతి అర్బన్ : శెట్టిపల్లె పరిధిలోని వివాదాస్పద భూములపై డిసెంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు బహిరంగ విచారణ చేపట్టనున్నట్లు ఆర్డీఓ రామ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సంబంధిత భూ యజమానులు పూర్తి ఆధారాలతో విచారణకు హాజరు కావాలని సూచించారు. 2వ తేదీన సర్వే నంబర్ 428 నుంచి 474 వరకు, 3న సర్వే నంబర్ 387 నుంచి 408 వరకు , 4న సర్వే నంబర్ 409 నుంచి 427 వరకు, 475 నంబర్‌లోని అర్జీదారులు రావాలని తెలిపారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు బహిరంగ విచారణ జరుగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని భూ హక్కుదారులు సద్వినియోగం చేసుకోవాలని, వివాదాలను పరిష్కరించుకోవాలని ఆర్డీఓ సూచించారు.

సెలవులపై పరిమితి విధింపా?

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల సెలవులపై పరిమితి విధించడం సరికాదని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అపార్ నమోదు ప్రక్రియతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు.

ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ మౌర్య



రాజ్యాంగ పీఠిక చదువుతున్న న్యాయమూర్తులు



చంద్రగిరి ఎంపీడీఓ కార్యాలయంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ తదితరులు



రాజ్యాంగం.. సమన్యాయం

"భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం. ప్రజలకు కల్పించిన హక్కుల సమాహారం. అన్నివర్గాలకు బాబా సాహెబ్ అంబేద్కర్ అందించిన సమన్యాయం.. దేశ స్థితిగతులను నిర్దేశించే పవిత్ర గ్రంథం"అని అధికారులు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మహనీయుల సేవలను స్మరించుకున్నారు. త్యాగధనుల స్ఫూర్తితో పేదల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

- ఘనంగా సంవిధాన్ దివస్
- అంబేద్కర్‌కు నివాళులర్పించిన నేతలు, అధికారులు, విద్యార్థులు
- రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుతామని ప్రతిజ్ఞ
- మార్గదర్శకాలను స్ఫూర్తిగా ముందుకు సాగుతామని ప్రతిజ్ఞ



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు



రామచంద్రాపురం : ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ ఇందిరమ్మ

తిరుపతి తుడా : భారత రాజ్యాంగం మార్గదర్శకాలను స్ఫూర్తిగా తీసుకుని సమన్యాయం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తెలిపారు. మంగళవారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రాజ్యాంగ ప్రవేశికను చదివి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ మన రాజ్యాంగం ప్రపంచంలోనే ఆదర్శవంతమైందని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, అనిల్ కుమార్, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, సేతుమాధవ్, రవి, మాహాపాత్ర, సెక్రటరీ రాధిక, మేనేజర్ హసీమ్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్వీజేసీలో..

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల(ఎస్వీజేసీ)లో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ ప్రజల జీవన గతికి రాజ్యాంగం కరదీపిక అని తెలిపారు. 75 వసంతాలు పూర్తి చేసుకున్న రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ కృషి ఎనలేనిదని కొనియాడారు. అనంతరం అంబేద్కర్‌కు నివాళులర్పించారు. విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్ బాబు వేర్వేరుగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఏఓ శేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో..

తిరుపతి సిటీ : ఎస్వీయూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం అధ్యక్షుడు మన్నం ప్రేమ్‌కుమార్, ఎంజేఎస్ వ్యవస్థాపకుడు సుధాకర్ మాదిగ, భారతీయ దళిత విద్యార్థి సేన వ్యవస్థాపకుడు కొండ యుగంధర్, ఏపీ వీహెచ్‌ఎస్ సెక్రటరీ ముని, నేతలు సుకుమార్, హరి, ప్రభు , పవన్, వెంగల్ రావు , సాయి, సంపత్, దినేష్ పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న అంబేద్కర్ భవన్ కమిటీ ప్రతినిధులు

కోర్టు ఆవరణలో..

తిరుపతి లీగల్ : తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆవరణలో రాజ్యాంగ దినోత్సవం జరుపుకున్నారు. రాజ్యాంగ పీఠిక లోని అంశాలను ప్రమాణం చేశారు. కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్, నాలుగో అదనపు జిల్లా జడ్జి అర్చన, పదో అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, ఎర్రచందనం కేసుల విచారణ జడ్జి నరసింహమూర్తి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి విజయ సారథి రాజు, జూనియర్ సివిల్ జడ్జిలు కోటేశ్వరరావు, గ్రంధి శ్రీనివాస్, సత్య కాంత్ కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంబేద్కర్ లా కళాశాలలో..

తిరుపతి సిటీ: స్థానిక అంబేడ్కర్ గ్లోబల్ లా కళాశాలలో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కళాశాల చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అనంతరం భారత రాజ్యాంగం–అంబేడ్కర్ కృషి అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాయలసీమ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సంవిధాన్ దివస్

తిరుపతి(అలిపిరి): బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం సంవిధాన్ దివస్ నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప , రాష్ట్ర కార్యదర్శి ముని సుబ్రమణ్యం, అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు బి. చంద్రారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పొనగంటి భాస్కర్ , ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, గవ్వల అశోక్ , పాల్గొన్నారు.



లా కళాశాలలో ..

అంబేద్కర్ భవన్ కమిటీ ఆధ్వర్యంలో..

తిరుపతి కల్చరల్ : ఆర్టీసీ బస్టాండ్ వద్ద రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి అంబేడ్కర్ భవన్ కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా సీటీఓ హరీష్‌రావు హాజరై రాజ్యాంగ పీఠికను చదివించి ప్రమాణం చేయించారు. కమిటీ చైర్మన్ పి.పరమశివన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించే హక్కును రాజ్యాంగం ద్వారా కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కె.మురళి, కృష్ణయ్య, సుబ్రమణ్యం, రాధాకృష్ణ, రామ్మూరి, పున్నాక సురేష్, పుష్పరాజ్ ,మొగిలిప్ప, రాఘురాములు, అశోక్ సామ్రాట్, చరణ్, గురవయ్య, ఎస్సీ,ఎస్టీ సంఘం నేత ఎం.ప్రసాద్‌రావు, టి.మహేష్ పాల్గొన్నారు.

తెలుగులో అందించాలి

భారత రాజ్యాంగాన్ని తెలుగులోకి అనువదించాలని ప్రజలకు అందించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ నిర్వహించారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ ఇందిరమ్మ పూలమాలు వేసి నివాళులర్పించారు. ఎంఈఓలు మార్కొందయ్య నాయుడు, జయవేలు, విద్యుత్ శాఖ ఏఈ గోపీ పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల : ఎంపీడీఓ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలుర జూనియర్ కాలేజీలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శశిరేఖ, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజ రెడ్డి, ప్రిన్సిపాళ్లు మొహిద్దీన్‌బాషా, ఉమా మహేశ్వరి, ఎన్ఎస్ఎస్ అధికారి మునిరాజా పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

– ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేస్తున్న సీఎండీ సంతోషరావు, అధికారులు

తిరుపతి రూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు వరకుమార్, ఆదిశేషయ్య, జానకిరాం, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు జయరామ్, సుబ్రమణ్యం, జనార్ధన్, అధికారులు పాల్గొన్నారు.



తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో...

తిరుపతి రూరల్: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీఓ రామచంద్ర, అధికారులు పాల్గొన్నారు.

నాగన్న సేవలు చిరస్మరణీయం

తిరుపతి(అలిపిరి): స్విమ్స్ బయోకెమిస్ట్రీ విభాగం వారు మంగళవారం శ్రీపద్మావతి ఆడిటోరియంలో డాక్టర్ బి.నాగన్న 5వ చైర్ ఓరేషన్ కార్యక్రమం నిర్వహించారు. నాగన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వీసీ ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ నాగన్న సేవలు చిరస్మరణీయమన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, వైద్యులు బీసీఎం ప్రసాద్, కళావత్, నాగరాజు, ఉమామహేశ్వర రావు, హరిణీదేవి, కుసుమ కుమారి, శిల్పా, మాధవి, సుధారాణి, ఆలోక్ సచన్ పాల్గొన్నారు.

పారదర్శకంగా నియమాకాలకు వినతి

తిరుపతి సిటీ : ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్ నియామకాలు పారదర్శకంగా చేపట్టాలని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు వినతి పత్రం సమర్పించారు. అలాగే వర్సిటీలోని ఐ బ్లాక్ వసతి గృహంలో బయటి వ్యక్తులు విద్యార్థులపై దౌర్జన్యాలకు దిగుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, అశోక్ పాల్గొన్నారు.

సాంకేతిక ఆవిష్కరణలపై వర్క్‌షాపు



వర్క్‌షాపులో అతిథులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ డేటా సైన్స్ విభాగం మంగళవారం సాంకేతిక ఆవిష్కరణ, ఉత్పత్తి అభివృద్ధి, మన భవిష్యత్తు అనే అంశాలపై వర్క్‌షాపు నిర్వహించింది. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పీవీ నరసయ్య, ప్రొఫెసర్ జి.అంజన్‌బాబు, ప్రొఫెసర్ పద్మావతమ్మ.. సాంకేతిక రంగంపై ప్రపంచం ఎలా ఆధారపడుతోందో తెలిపారు.శాస్త్రవేత్త పద్మనాభం మాట్లాడుతూ సాంకేతిక ఆవిష్కరణలు, ఉత్పత్తి అభివృద్ధి మార్కెట్ అవసరాలను తీర్చడంలో కీలకమని వెల్లడించారు. ప్రొఫెసర్ విజయలక్ష్మి, శ్రీదేవి, రమేష్ బాబు, యశ్వంత్ కుమార్, మల్లికార్జున పాల్గొన్నారు.

లీడర్‌షిప్ శిక్షణ తనిఖీ

రామచంద్రాపురం: సి.రామాపురం సమీపంలో ఉన్న వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో పాఠశాలల హెడ్స్‌కు నిర్వహిస్తున్న లీడర్‌షిప్ శిక్షణను స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయ రామరాజు మంగళవారం తనిఖీ చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పేరెంట్, టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని సూచించారు. ఆర్డీ శామ్యూల్, డీఈఓ కేవీఎన్ కుమార్ ఏఎంఓ శివశంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీ



ఎంపీడీఓ రామచంద్ర

తిరుపతి రూరల్ : ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతి విద్యార్థికి అపార్ యూనిక్ ఐడీ అందించేందుక చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని మొత్తం 31,393 మంది పిల్లలకు అపార్ నమోదు చేయించాలని గుర్తించినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు 21,638 మందికి పూర్తి చేశామన్నారు. ఆధార్ కార్డుల్లో తప్పుల కారణంగా 9,680 మందికి ఇంకా అపార్ ఐడీ రాలేదని చెప్పారు. ఈ సమస్య పరిష్కరించేందుకు కళాశాలల్లోనే ఆధార్ సెంటర్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. తిరుచానూరులో శ్రీచైతన్య జూనియర్ కళాశాల, వసుంధరనగర్‌లోని సంస్కృతి కళాశాల, పేరూరులోని శ్రీచైతన్య, పెరుమాళ్లపల్లెలోని ఏవన్ ఎస్ఆర్ఐ కళాశాల, పాడిపేటలోని శ్రీచైతన్య, శ్రీనివాసపురంలోని ఎస్ఆర్ కళాశాల, దుర్గసముద్రంలోని శ్రీచైతన్య, గాంధీపురం పంచాయతీ ధనలక్ష్మినగర్‌లోని అను ఒకేషనల్ కళాశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ముమ్మరంగా మ్యాపింగ్

మండలంలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. మొత్తం 56,049 ఇళ్లకు గాను 37,031 గృహాల మ్యాపింగ్ పూర్తయిందని వెల్లడించారు. అలాగే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) సీడింగ్ సైతం 77 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ నెల 30వ తేది లోపు మొత్తం వందశాతం పూర్తి చేస్తామని వెల్లడించారు.

సమష్టిగా పిల్లల సంరక్షణ



మాట్లాడుతున్న వెంకటరత్నం

తిరుపతి కల్చరల్ : పిల్లల సంరక్షణకు సమష్టిగా కృషి చేయాలని రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం పిలుపు నిచ్చారు. మంగళవారం రాస్ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల రక్షణకు ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ అఘాయిత్యాలు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి నివారణకు ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు ఒకే వేదికగా ఏర్పడాలని సూచించారు. సీఐ కె.మధుసూదన్ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లకు అలవాటు పడిన పిల్లలు పెడదోవపడుతున్నట్లు వెల్లడించారు. ఈ విషయంలో తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. రాస్ ప్రాజెక్టు అధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాలల రక్షణ కమిటీ ఏర్పాటు చేసి, అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో డీసీపీఓ శివశంకర్, సీడబ్ల్యూ చైర్మన్ వసంత, విన్స్ ప్రతినిధి మీరా, లేబర్ విభాగం రాజయ్య, సీడీపీఓ సుధారాణి, రమణ, ప్రగతి, హేమశేఖర్, మునిలక్ష్మి, దివ్యాంగ సేవా ప్రతినిధి రమణ, వే ఫౌండేషన్ అంకయ్య, ఉయ్ సపోర్టు ప్రతినిధి తహసున్నీసా, రాజు, వెంకటేష్, యువ కిషోర్ పాల్గొన్నారు.

గంజా.. పంజా!

గంజాయికి పలువురు యువకులు బానిసలవుతున్నారు. చిన్న వయసులోనే జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మత్తులో ఉన్మాదుల్లా ప్రవర్తిస్తూ వీరంగం సృష్టిస్తున్నారు. చంద్రగిరి శివారు ప్రాంతాల్లోని అసంపూర్తి కట్టడాలను అడ్డాగా మార్చుకుని చెలరేగిపోతున్నారు. ఒళ్లు తెలియని స్థితిలో పరస్పరం దాడులు చేసుకుంటూ శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్నారు. సమీప కాలనీల్లోని వారికి మనశ్శాంతిని దూరం చేస్తున్నారు. ఈ క్రమంలోనే చాప కింద నీరులా విస్తరిస్తున్న గంజా విక్రయాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధానంగా రాత్రివేళల్లో పకడ్బందీగా పెట్రోలింగ్ చేపట్టాలని సూచిస్తున్నారు.

- మత్తుకు చిత్తవుతున్న యువకులు
- చంద్రగిరి శివారు ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్ వీరంగాలు
- ఆందోళన చెందుతున్న స్థానికులు



గంజాయి బ్యాచ్ అడ్డాగా మార్చుకున్న ఇల్లు (ఇన్‌సెట్) మత్తుకు వాడిన వస్తువులు

చంద్రగిరి : వివిధ మార్గాల్లో తరలివస్తున్న గంజాయికు యువత అలవాటు పడుతోంది. చంద్రగిరి పట్టణ శివారుల్లోని అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను తమకు అనుకూలంగా మార్చుకుంటోంది. విచ్చలవిడిగా గంజాయిను పీలుస్తూ జీవితాలను చేజేతులా పాడు చేసుకుంటోంది. గంజాయిని పూర్తి స్థాయిలో నివారిస్తామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు గుప్పిస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. ఇటీవల కాలంలో అగరాలలోని జగనన్న కాలనీలో కొందరు యువకులు రాత్రి, పగలు తేడా లేకుండా గంజాయి సేవిస్తున్నారు. ఆ మత్తులో పిచ్చెక్కినట్లు నానా బీభత్సం సృష్టిస్తున్నారు. గంజాయి బ్యాచ్ ఆగడాలకు స్థానికులు భయంతో వణికిపోతున్నారు.

గ్రూపులుగా చేరి..

అగరాల వద్ద జగనన్న కాలనీలో నిర్మాణంలోని ఓ ఇంట్లో కొంత మంది యువకులు కొద్ది రోజులుగా గంజాయిను పీలుస్తూ మత్తులో జోగుతున్నారు. నలుగురైదురుగు యువకులు గ్రూపులుగా చేరి గంజాయి మత్తులో తేలియాడుతున్నట్లు సమాచారం. ఒక్కోసారి అధిక మొత్తంలో గంజాయి పీల్చడం ద్వారా పెద్ద పెద్ద కేకలు వేస్తూ, గొడవలకు దిగుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెట్రోలింగ్ చేపట్టాలి

కొద్ది రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా గంజాయి వ్యవహారం నడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. గంజాయి బ్యాచ్ ఎక్కడ దాడులు చేస్తారో అని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని తిరుగుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి పకడ్బందీగా పెట్రోలింగ్ చేపట్టాలని కోరుతున్నారు.

ఆగని గజదాడులు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం దిగవూరు, ఎగవూరు పంచాయతీల్లోని పంట పొలాలపై గజరాజుల దాడులు ఆగడం లేదు. చెరుకు, వరి, టమాట, మామిడి పంటలపై సోమవారం రాత్రి దాడులు చేశాయి. శాంతినగర్‌కు చెందిన రైతుల చెరు కు తోటలను నాశనం చేశాయి. టమాట పంటను ధ్వంసం చేశాయి. దెబ్బతిన్న పంటలను దిగవూరు సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎగవూరు సర్పంచ్ కుమారి, మాజీ సర్పంచ్ దేవప్రసాద్ పరిశీలించారు. రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.